**కథ**

# ముగిసిన అధ్యాయం

**పూజ ముగించి మడిబట్ట మార్చుకుని దేవుడిగదిలో నుంచి బయటకు వచ్చింది లక్ష్మీదేవి.**

**"అత్తయ్యా! కాఫీ!" అంటూ కోడలు సరస్వతి స్టీలుగాసు అత్తగారి చేతికి అందించింది.**

''అమ్మా సరస్వతీ! ఒక పక్క నీకు ఆఫీసుకు టైమవుతోంటే కాఫీ కలిపి నాకు చేతికి అందించాల్సిన అవసరం ఏంటి? నేను కలుపుకుని తాగలేనా?''

''ఫర్వాలేదత్తయ్యా. ఇంకా అరగంట టైమ్ వుంది. వంటపని, ఇంటిపని అన్నీ మీరే చేస్తారు. కనీసం ఇలాంటి చిన్న చిన్న పనులయినా నన్ను చెయ్యనివ్వండి. నేను ఈ ఇంట్లో అడుగు పెట్టినప్పటినుంచీ చూస్తున్నాను. ఒక్క అరగంట విశ్రాంతిగా ఏనాడూ కూర్చోరు మీరు. ఆఫీసుకు వెళ్ళినప్పుడు ఇంట్లో మీరు ఎన్నెన్ని పనులు చేస్తారో నాకు తెలుసు. పెద్దవయసులో మీరింత కష్టపడటం మంచిదా చెప్పండి?'' సరస్వతి కంఠంలో అత్తగారి మీదవున్న ప్రేమ, శ్రద్ధ మాటల రూపంలో సున్నితంగా బయటికి వచ్చాయి.

పని ప్రస్తావన వస్తే చాలు పేట్రేగిపోతుంది లక్ష్మీదేవి. అడ్డెడు బియ్యాన్ని అవలీలగా వార్చిన చేతులు అవి. పది మానికల బియ్యాన్నయినా అలుపెరుగక పిండికొట్టిన గూడలు అవి.

''ఈ పనీ ఒక పనేనటే అమ్మాయ్. ఇప్పుడు మనం ఏం చేస్తున్నామని? అన్నీ మిషన్లేగా చేసేది? ఉమ్మడి కుటుంబాలలో నలుగురు ఆడంగులం కల్సి మాటా ముచ్చటా చెప్పుకుంటూ బండపన్లన్నయినా బద్ధకం ఎరుగక చేసుకునేవాళ్ళం. ఈరోజుల్లో ఆ పనులూ లేవు. ఆ తిండ్లూ లేవు'' దీర్ఘం తీస్తూ అంది లక్ష్మీదేవి.

అత్తగారి కోపానికి, ఉక్రోషానికి కారణం తెలిసిన సరస్వతి చిరునవ్వు నవ్వింది. ఆవిడకు ఈమధ్య బి.పి. వచ్చింది. డాక్టర్ ఉప్పు తినవద్దన్నాడు. వెయిట్ కూడా కాస్త ఎక్కువుందని తీపి పదార్థాలు పూర్తిగా బంద్ చేయమన్నాడు. దాంతో అవేవీ తినకుండా కంట్రోల్ చేస్తుంటుంది ఎప్పటికప్పుడు సరస్వతి. నోరు కట్టేసినట్లు కావడంతో చిరాగ్గా వుంది లక్ష్మీదేవికి.

''తప్పదు అత్తయ్యగారూ! డాక్టర్ చెప్పినట్లు వినకపోతే తరువాత మనమే ఇబ్బందిపడాల్సి వస్తుంది. మీరోజులు వేరు, ఈరోజులు వేరు. కాలాన్ని బట్టి మీరూ మారక తప్పదు కదా''

''అదీ నిజమేలేగానీ నీకు టైమ్ కావటం లేదూ.. అవునూ అన్నట్లు ఈరోజు గాయత్రికి ఆఫ్ డే కదూ''

''అవును. త్వరగా వచ్చేస్తుంది. ఉన్నదేదో తింటుంది. మీరు దానికోసం స్పెషల్ వంటలేమీ చేయకండి''

''నా నోరు కట్టేస్తే కట్టేసావ్. దాని నోరు మాత్రం కట్టేయకు. పసిదానికి ఇంత పాయసమో, రవ్వంత కేసరో చేసినంత మాత్రానే హైరానాపడిపోతానా నేను'' అంది లక్ష్మీదేవి మనవరాలి మీద ప్రేమ, గారాబం ప్రతిమాటలో పుట్టిపడగా. ఇంతలో ''అత్తయ్యా..'' అని పిలిచింది సరస్వతి.

సరస్వతి కంఠంలోని మార్దవానికి, నెమ్మదితనానికి ఆశ్చర్యంతో తలెత్తిచూసింది లక్ష్మీదేవి. ''ఏంటమ్మా!'' అంది తనూ ప్రేమగా.

''ఆయన ఉత్తరం రాసారు''

ఆ మాటలతో లక్ష్మీదేవి ముఖం ఎర్రగా కందిపోయింది. ''వాడికి సిగ్గు ఎలాగూ లేదు. నీ ఆత్మాభిమానం ఎక్కడకు పోయింది? ఉత్తరం విప్పుకుండానే చింపేయలేకపోయావా?''

ఉత్తరం చేతిలోకి తీసుకుని అటూ ఇటూ తిప్పి చూసింది లక్ష్మీదేవి. ఉత్తరాన్ని మునివేళ్ళతో కోడలికి కనిపించేలా పట్టుకుని

''నువ్వు చెప్పమ్మా సరస్వతీ. దీన్ని ఏం చేయమంటావ్. ఇలాగే చింపేయమంటావా. నాకయితే వాడు ఉండీలేనివాడితో సమానం. వాడితో ఉత్తర ప్రత్యుత్తరాలలాంటి సంబంధాలు పెట్టుకుంటే మన నిర్ణయం, మన అభిమానం అర్థం లేనివిగా మిగిలిపోతాయి. నువ్వు ఇది చదివితే నీ పట్టుదలలో సడలింపు వచ్చే ప్రమాదం వుంది. అది నిన్ను మళ్ళీ ఆ నరకకూపంలోకి తోయవచ్చు. అది చూసి తట్టుకునే శక్తి ఇక నాకు లేదు''

ఒక్క నిముషం తీక్షణంగా ఆలోచించింది సరస్వతి. ''చింపేయండి అత్తయ్యా..దాన్ని మీరే చింపేయండి'' అంది.

లక్ష్మీదేవి కళ్ళలో నెలుగు ఒక్కసారిగా తళుక్కుమంది. కసిగా ఉత్తరాన్ని ముక్కముక్కలుగా చేసి మండుతున్న పొయ్యిలో పడేసింది.

**మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కథ**


★ ★ ★

'పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయంటారు. అదే నిజమైతే బంగారం లాంటి సరస్వతికి ఏ బుద్ధిమంతుడ్నో, ఏ ప్రయోజకుడ్నో భర్తగా ముడెయ్యక నా కొడుకును ఎందుకు కట్టబెట్టారు ఆ దేవుళ్ళు?' అని రోజుకొకసారయినా అనుకుంటుంది లక్ష్మీదేవి. అలా అనుకోగానే వెంటనే అంతరాత్మ వచ్చి ఆమె కట్టెదుట నిలుస్తుంది. 'ఈ పెళ్ళిలో ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానయినా నీ ప్రమేయం ఇసుమంత కూడా లేదా?' అని ప్రశ్నిస్తుంది. వెంటనే ఆమె కళ్ళముందు ఆనాటి పెళ్ళిచూపుల దృశ్యం కనబడుతుంది.

పెళ్ళి చూపులు ముగిసాయి. అందరికీ అమ్మాయి నచ్చింది. నచ్చకేం చేస్తుంది? చిదిమి దీపం పెట్టుకోవచ్చు అనిపించేటంతటి అందం. మంచి మర్యాద, వినయం విధేయత అన్నీ వున్నాయి.

''అమ్మాయ్! నువ్వేమంటావ్?'' అడిగారు అక్కడున్న పెద్దలెవరో సరస్వతిని. ఆమె నోట్లోనించి సమాధానం రాకముందే ''ఒక్కసారి నేను అమ్మాయితో ఒంటరిగా మాట్లాడాలనుకుంటున్నాను'' అంది లక్ష్మీదేవి అకస్మాత్తుగా. అందరూ ఆశ్చర్యంగా చూసారు. లక్ష్మీదేవి లేచి సరస్వతి చెయ్యి పట్టుకుని అవతలి రూమ్‌లోకి తీసికెళ్ళింది. లక్ష్మీదేవి మాట్లాడుతుంటే సరస్వతి తల వంచుకుని కూర్చుని శ్రద్ధగా వింది. ''అమ్మా సరస్వతీ మా అబ్బాయి నీకు నచ్చాడో లేదో నాకు తెలియదు. నీకు నేను కొన్ని విషయాలు చెప్పాలి. పెళ్ళి అంటే నూరేళ్ళ పంట. అందుకే జీవిత భాగస్వామిని ఎన్నుకునే ముందు ఒకటికి పదిసార్లు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. చూపులకు మావాడిలో వంకపెట్టాల్సింది ఏమీ లేదు. మనిషి బాగుంటాడు. కానీ దుడుకు మనిషి. కోపం, ఆవేశం ఎక్కువ. వాడితో నెగ్గుకొచ్చే మనిషికి చాలా ఓర్పు, సహనం కావాలి. అవి నీలో వున్నాయని చూడగానే నాకనిపించింది. అయితే అసలు విషయం. మావాడికి ఎలా అలవడ్డాయో, ఎందుకలవడ్డాయోగానీ కొన్ని దురలవాట్లు అలవడ్డాయి. మా దగ్గర వున్నన్నాళ్ళూ శ్రద్ధాసక్తులతో పద్ధతిగానే పెంచాం. మాది పల్లెటూరి నివాసం కావటం వల్ల కాలేజీ చదువుకు పట్టణంలో హాస్టల్లో వుంచి చదివించాల్సి వచ్చింది. చెయ్యిజారిపోయాకగానీ మాకు ఆ విషయం తెలియలేదు. ఆ తరువాత మేము ఎంత ప్రయత్నించినా వాడ్ని మళ్ళీ మామూలు మనిషిగా చెయ్యలేకపోయాం. మేము చెయ్యలేని పని వాడికి భార్యగా రాబోయే అమ్మాయయినా చేస్తుందన్న ఆశతో ఈ పెళ్ళి ప్రయ

త్నాలు మొదలుపెట్టాం. అలా మారితే సంతోషం. కానీ మారకుంటే ఆ అమ్మాయి బ్రతుకంతా ఏడుస్తూ..కన్నీళ్ళతో కాలం గడపాల్సి వుంటుంది. అది మాకు ఇష్టం లేదు. అందుకే నిర్ణయం నీకు వదిలేస్తున్నాను''



సరస్వతి ఒక్క నిముషం మౌనంగా వుంది. ఆ తర్వాత ధైర్యాన్ని కూడగట్టుకుని ''ఆయనకన్నా ముందు, మీరు..మీ పద్ధతి నాకు నచ్చాయి. కొడుకులోని లోపాలను, బలహీనతలను కప్పిపుచ్చి, స్వార్థంతో నచ్చిన పిల్లను తమ కోడలిగా చేసుకునే అత్తగార్లనే చూసాను ఇంతవరకు. ఇంత సంస్కారవతులయిన మీ కడుపున పుట్టిన ఆయన అలా ప్రవర్తిస్తున్నారంటే అది దుష్టుల సాంగత్యం, స్నేహప్రభావమే కావొచ్చు. ఈ పెళ్ళి జరిగితే మీరు నామీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముగానీయకుండా నా ప్రయత్నం నేను చేస్తాను. ఫలితం లేకుంటే అప్పుడు అది నా ఖర్మ అనుకుంటాను'' అంది సరస్వతి.

ఆఖరి మాటలకు దెబ్బతిన్న పక్షిలా విలవిలలాడిపోయింది లక్ష్మీదేవి మనసు. ''నీ మాటలు నాకు నచ్చాయి. ఆ ఆఖరి మాటలు తప్ప. 'ఖర్మ, తలరాత'లాంటి మాటలు ఈకాలం ఆడపిల్లల నోటి వెంట శోభించవు. జీవితంలో ఎలాంటి వ్యక్తులతోనయినా, ఎలాంటి పరిస్థితులతోనయినా ఎదిరించి పోరాడగల నేర్పు, గుండెధైర్యం, తెలివితేటలు నీలో వున్నాయా లేదా అన్నదే ఇంతవరకు నేను నీతో మాట్లాడిన మాటలకర్థం. 'ఖర్మ' అనుకుంటూ జీవితాంతం నా ఇంట్లో, నా కళ్ళెదురుగా పడివుండేటట్లయితే దయచేసి నువ్వు ఈ పెళ్ళికి అంగీకరించకు'' అంది లక్ష్మీదేవి.

''అది..అది కాదండీ..నా ఉద్దేశం..అది కాదు'' అంటూ కంగారు, భయం కలగలిసిన గొంతుతో అంది సరస్వతి.

''సరస్వతీ అలా కంగారు పడకు. నువ్వింకా చిన్నపిల్లవు. మరో విషయం చెబుతున్నాను విను. నీ ఆలోచనలను నేను చాలావరకు అర్థం చేసుకున్నాను. మీ నలుగురు అక్కచెల్లెళ్ళలో నువ్వు పెద్దదానివి. మీ నాన్నగారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే గనుక కట్నాలు, పెళ్ళి ఖర్చులు భరించి నలుగురి పెళ్ళిళ్ళు చేయటం అంటే ఆయనకు తలకుమించిన పనే. కనుక వెతుక్కుంటూ వచ్చిన మా సంబంధాన్ని కాదనుకున్న దానికన్నా ఒప్పుకుంటే మీ నాన్నగారి తలమీది బాధ్యతను కొంతైనా దింపినదానివవుతావని ఆలోచిస్తున్నావు నువ్వు'' ఈసారి ఆశ్చర్యంగా లక్ష్మీదేవివంక చూసింది సరస్వతి.

''సరస్వతీ ఆ విషయాలన్నీ పక్కకుపెట్టి నీ దృష్టిని ఒకే విషయం మీదికి కేంద్రీకృతం చెయ్యి. అది జీవితాన్ని ఛాలెంజ్‌గా తీసుకోగల సాహసం నీకుందా లేదా అన్నది''

లక్ష్మీదేవి మాటలకు మంత్రముగ్ధురాలై నోటమాటరాక కాసేపు అలాగే వుండిపోయి సరస్వతి. తన పరిధిలో, తనకున్న చిన్నపాటి అనుభవంలో తాను ఏమాలోచించిందో ఏమోగానీ ఉన్నట్టుండి ఏదో నిర్ణయానికి వచ్చినట్లు ''ఉంది. ఆ సాహసం నాకుంది. నాకు ఈ పెళ్ళి ఇష్టమే.'' అంది. ఆ మాటలు సరస్వతి మనస్ఫూర్తిగానే అంటోందని అర్థమయింది లక్ష్మీదేవికి. చిరునవ్వుతో కాబోయే కోడల్ని దగ్గరకు తీసుకొని నుదుటిమీద ముద్దుపెట్టుకుంది.

★★★

గదిలోకి పంపిన అరగంటకే వెనక్కు తిరిగి వచ్చిన కొత్తపెళ్ళికూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది లక్ష్మీదేవి. అత్తగారి చూపులకర్థం తెలుసుకున్న సరస్వతి తలవంచుకుని ''ఆయన నన్ను బయటికెళ్ళి పడుకోమన్నారత్తయ్యా'' అంది.

''ఎందుకు?''

''నాలో అందం వుందిగానీ ఆకర్షణ లేదట. తను డ్రింక్ చేస్తూ నన్నూ తాగమన్నారు. నేను తాగనన్నాను. చెంపమీద ఒక్కటేసారు. నాకు కావాల్సింది నీలాంటి పల్లెటూరి దద్దమ్మలు కాదు. మోడర్న్ గర్ల్ కావాలి. నువెళ్ళిపో అని కసిరికొట్టారు''

సరస్వతి చెప్పింది వినగానే లక్ష్మీదేవి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

కోడల్ని అక్కున చేర్చుకుని చెంపనిమిరి ''నన్ను క్షమించమ్మా'' అంది బాధతో.

''మిమ్మల్నెందుకు క్షమించడం? మీరేం చేసారు?''

సరస్వతి చుబుకం పట్టుకుని పైకెత్తి ''చూడమ్మా నువ్విలా భయపడుతూ అమాయకంగా కనిపిస్తూ వుంటే వాడికి మరీ అలుసైపో

డా.కొఠారి వాణీచలపతిరావు

తావ్. ఒక్కసారి అలుసిచ్చావంటే ఇక జీవితాంతం వాడికి బానిసగా నువ్వు పడి ఉండాల్సి వస్తుంది. వాడు వెళ్ళమంటే 'నేనెందుకు వెళ్ళాలి?' అని వుండాలిగానీ ఇలా తలవంచుకుని బయటకు రాకూడదు. మరోసారి నీమీదకు చెయ్యెత్తితే ఆ చెయ్యి గట్టిగా పట్టుకుని విరిచేసెయ్. ఇంక నీ జోలికిరాడు'' అని ధైర్యం చెప్పి మళ్ళీ లోపలికి పంపించింది లక్ష్మీదేవి.

ఈసారి లోపల ఏం జరిగిందో సరస్వతి భర్తతో ఏం మాట్లాడిందోగానీ మళ్ళీ బయటకు రాలేదు.

పెళ్ళయి పదహారురోజులు గడిచిపోయాయి.

కొడుకు ముఖంలో సంతోషం, కోడలిముఖంలో సిగ్గులమొగ్గలు ఇవేవీ కనిపించడం లేదు లక్ష్మీదేవికి.

రొటీన్‌గా ఎవరి పనులు వారు చేసుకుంటూ పోతున్నారు. మధ్యమధ్యలో బెడ్‌రూమ్‌లో నుండి వాగ్యుద్ధాలు మాత్రం వినిపిస్తున్నాయి.

తను చూపిన దారిలో కోడలు నడుస్తున్నందుకు లోలోపలే ఆనందపడింది లక్ష్మీదేవి. ఓరోజు ఇల్లూడుస్తున్న కోడలితో ''అమ్మా సరస్వతీ నువ్వు నీ స్టడీస్ గురించి ఆలోచిస్తున్నట్లు లేదు. వివాహంతో విద్య నాశనం అన్న మాటలు నీ విషయంలో నిజం కాకూడదు. నువ్వు పి.జి. చెయ్యాలి.'' అంది లక్ష్మీదేవి.

వారం పదిరోజుల్లోనే కాలేజీలో చేరిపోయింది సరస్వతి. ఒకరోజు కాలేజీ నుండి వస్తూనే-

## పెళ్లిగోల

**తారల పెళ్ళి ఎప్పుడు జరుగుతుందో ఎవ్వరికీ తెలియదు. తెలుగు, కన్నడ చిత్రాల్లో ఇంచుమించు అందరు అగ్రతారలతో నటించిన సౌందర్య అకస్మాత్తుగా పెళ్ళి చేసుకోబోతోందంటూ రూమర్లు వచ్చాయి. గ్లామర్‌తోపాటు మంచి అభినయం ఉన్న తారగా తనకంటూ ఓ ఇమేజ్‌ని సృష్టించుకున్న తార సౌందర్య పెళ్లి వార్తలు సంచలనం రేపాయి. సౌందర్య పెళ్లాడబోయే వ్యక్తి ఆమెకి సమీప బంధువేనని సన్నిహితవర్గాల భోగట్టా. గత ఏడాది డిసెంబర్‌లో ఎంగేజ్‌మెంట్ జరిగిందని, ఏప్రిల్ 27న పెళ్ళి జరుగబోతోందని రూమర్లు వచ్చాయి. ఈ విషయాన్నే అడిగితే ఆమె షాక్ అయింది. 'జీవితంలో పెళ్ళి ప్రధానమే అయినా పెళ్లి గురించి నేనంత ఎక్కువగా ఆలోచించ లేదు. నేనిప్పుడు చాలా బిజీగా ఉన్నాను. రెండు కన్నడ సినిమాల్లో నటించడానికి ఒప్పుకున్నాను' అంటోంది సౌందర్య.**


''కాలేజీలో చేరాక నా లైఫ్‌లో ఒక ఛేంజ్, ఒక చైతన్యం వచ్చినట్లుగా వున్నాయి. అయామ్ వెరీ హేపీ-'' అంది.

''నాకు కావాల్సిందీ అదే. అంతేకాదు నువ్వు ఎదగాలి. అది నేను చూడాలి''

ఆ మాటలతో సరస్వతి కళ్ళు ఆనందంతో సజలాలయ్యాయి.

''అత్తయ్యా! దారి తప్పుతున్న మీ కొడుక్కి భార్య తోడు లభిస్తే సక్రమమార్గంలో నడుస్తాడన్న ఆశతో నామీద నమ్మకముంచి నన్ను మీ కోడల్నిగా చేసుకున్నారు. కానీ నేను మీ ఆశను నెరవేర్చలేనేమోనని భయంగా వుంది. ఆయన మాటలతో నన్ను చిత్రవధ చేస్తున్నారు. తాగారంటే ఆయన మనిషికాదు. కాలాన్నంతా అలా తాగుడికి, పేకాటకు తగలేస్తున్న ఆయన్ని మార్చటం సాధ్యమేనా అని నాకు భయం వేస్తోంది. ఈ పెద్దతనంలో కొడుకు నీడలో హాయిగా కాలం గడపాల్సిన మీకు ఎంత మనోవ్యధో అని ఆలోచిస్తుంటే...''

''అలవాటయిపోయిందమ్మా. గుండెనిబ్బరం కలదాన్ని కనుక తట్టుకుంటూ జీవితాన్ని నెట్టుకుంటూ వస్తున్నాను. మీ మామయ్యగారికి ఆ శక్తిలేకే హార్టెటాక్ తెచ్చుకుని అర్థాంతరంగా కన్నుమూశారు. నా భర్త చావుకు కారణం నా కొడుకే అన్న నిజం నాకు వాడి మీద



మరింత అసహ్యాన్ని పుట్టించింది. అయినా ఏం చెయ్యను? నా భుజాలు దాటి తాటిచెట్టులా పెరిగిన నా కొడుక్కి నేను ఏమని చెప్పను? చెప్పి చెప్పి విసిగిపోయాను. వాడ్ని కన్నందుకు వదిలించుకోలేను గనుక భరించక తప్పదు. ఇదొక శాపం అంతే. నా బాధల్లా ఒకటే. నిన్ను గురించి. ఇన్నాళ్ళూ వాడి బాధ నేనొక్కదాన్నే అనుభవించాను. ఇప్పుడు మరొకదాన్ని నిన్ను తెచ్చి పెద్దతప్పు చేసానేమోనని బాధపడుతున్నాను'' అంది లక్ష్మీదేవి.

''నన్ను గురించి మీరేమీ బాధపడకండి అత్తయ్యా. తల్లిలాంటి మీ నీడలో నేను నిశ్చింతగా వున్నాను. లేని జీవితం గురించి ఆలోచించి తలబద్దలు కొట్టుకున్న దానికన్నా..ఉన్న జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నం చేద్దాం'' అంది సరస్వతి.

ఓరోజు ఉదయాన్నే లేచీలేవగానే స్నానం చేసి వంటింట్లోకి వచ్చిన కోడలిముఖంలో ఏదో మార్పు చూసి 'హమ్మయ్య' అని గుండెలమీద చెయ్యేసుకుంది లక్ష్మీదేవి.

భార్యాభర్తలను కలకాలం ఒక బంధంలో కట్టిపడేసేది, ఒకరికొకరుగా జీవింపచేసేది శారీరక సంబంధం. అది ఎలాంటి వాళ్ళనయినా మార్చేస్తుంది. ఎటువంటి పరిస్థితులనయినా దారిలో పెట్టేస్తుంది అనే నమ్మకంతో కొడుకు భవిష్యత్తు గురించి సరికొత్త కలకంది లక్ష్మీదేవి. కానీ దేవుడి మందిరం ముందు కూర్చుని పూజ చేస్తున్న సరస్వతి కళ్ళల్లో తడి గమనించి కంగారుగా ''ఏం జరిగింది?'' అని ప్రశ్నించింది.

ఒక్క నిముషం మౌనం తర్వాత నెమ్మదిగా...ఒక్కొక్కమాటే కూడబలుక్కుంటూ అంది సరస్వతి.

''రాత్రి..రాత్రి..ఆయన తాగినమైకంలో..ఎవరో..అనుకుని నాతో..భరించలేకపోయాను. అలా అని కాదనలేకపోయాను. కాసేపు కళ్ళుమూసుకుని భరిస్తే..ఆ విధంగానయినా ఆయన నాకు దగ్గరై దురలవాట్లకు దూరమవుతారేమోనని ఆలోచించాను. మీ కొడుకుని మీ కొడుకుగా మీకు అప్పగించగలనేమోనని ఆరాటపడ్డాను. కానీ కానీ..తెలివిరాగానే ఆయన మంచం మీంచి నన్ను కిందికి తోసేసారు. నేనంటే అసహ్యమట. ఎంత దగ్గరకి వెళ్ళాలని నేను ప్రయత్నిస్తుంటే ఆయన నన్ను అంత దూరం వుంచుతున్నారు'' అని ఆ తర్వాత మాటలు పెగలక వెక్కివెక్కి ఏడ్చింది సరస్వతి.

కోడల్ని అమాంతం అక్కున చేర్చుకుంది లక్ష్మీదేవి.

''వాడిలో మానవత్వం, సంస్కారం శూన్యమై అలా పశువులా ప్రవర్తిస్తున్నాడు. సరస్వతీ ఇంక లాభం లేదు. వాడు మారడు. వాడి మానాన వాడ్ని వదిలేసి నువ్వు కొంతకాలం మీ పుట్టింటి

కెళ్ళి అక్కడయినా ప్రశాంతంగా గడిపిరా. లేదా నీ కాలేజి, నీ స్టడీస్ మీద కాన్సన్‌ట్రేట్ చేసి వాడ్ని గురించి మర్చిపో'' అంది లక్ష్మీదేవి.

''నేను..నేను ఇక్కడే వుండి చదువుకుంటానత్తయ్యా'' అంది సరస్వతి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

''అలా అన్నావు బాగుంది'' అంది లక్ష్మీదేవి కోడలి ముంగురులను ఆప్యాయంగా సవరిస్తూ.

★ ★ ★

జీవితంలో కొన్ని సందర్భాలు, సంఘటనలు మనిషిని అయోమయంలో పడేసి ఆనందించాలో, విచారించాలో తెలియని స్థితిలో వదిలేస్తాయి. లక్ష్మీదేవి విషయంలోనూ అదే జరిగింది. సరస్వతి నెల తప్పింది.

ఆ విషయం వినగానే లక్ష్మీదేవి కొంత ఆందోళనకు గురయింది. నిజానికి అన్నీ సక్రమంగా వుంటే అది ఇంటిల్లిపాదికీ పండగరోజు అయేది. సరస్వతికి తన కొడుకును కట్టబెట్టడం ఆమె మెడకి గుదిబండను తగిలించటంలా మారిందని పశ్చాత్తాపపడుతున్న సమయంలో ఊహించని విధంగా మరో కొత్తబంధం వచ్చి పడబోతోంది. ఇది సరస్వతి జీవితానికి మరో బంధనం కాదు కదా- అని భయపడుతోంది.

తొమ్మిది నెలలు వచ్చేదాకా చూలింత అయిన సరస్వతిని కన్నబిడ్డలా చూసుకుంది. ఒక్కపనీ చెయ్యనివ్వలేదు. రోజూ పండ్లు, పాలు, ఆకుకూరలు, జ్యూసులు ఇస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంది. చదువు విషయంలో మాత్రం ఊపిరిసలపనివ్వలేదు. కోడల్ని తను ఎంత బాగా చూసుకున్నా...అసలు చూసుకోవల్సిన వ్యక్తి నుంచి ప్రేమ ఆదరణ లభించకపోవటంతో ఆమెకు సంతృప్తిగా లేదు.

ఆరోజు లివింగ్ రూమ్‌లో దివాన్ మీద అలాగే నిద్రపోయిన లక్ష్మీదేవికి కొడుకు, కోడలి బెడ్ రూమ్‌లో నుంచి అర్ధరాత్రి అరుపులు, కేకలు, భళ్ళుమన్న శబ్దాలు వినిపించడంతో దిగ్గున లేచి కూర్చుంది.

''అత్తయ్య పడుకున్నారు. అరవకండి..ప్లీజ్''

''షటప్! నేను అరుస్తాను. కేకలేస్తాను. నువ్వెవతివే నాకు చెప్పటానికి నోరెత్తావంటే చంపేస్తాను''

''ఇప్పుడు నేనేమన్నానని అంత కోపం తెచ్చుకుంటున్నారు? ఎక్కువగా తాగకండి అన్నాను. అత్తయ్య మీ విషయంలో బాధపడుతున్నారు. ఆవిడను కష్టపెట్టకండి అన్నాను. ఒక కొడుకుగా, ఒక భర్తగా, పుట్టబోయే బిడ్డకు తండ్రిగా మీకు కొన్ని బాధ్యతలున్నాయి. వాటిని నిర్లక్ష్యం చెయ్యకండి అన్నాను. ఇందులో తప్పేముందో మీరే చెప్పండి'' ప్రాధేయపడుతున్నట్లున్న సరస్వతి కంఠం మూసిన తలుపుల వెనకనుండి దీనంగా వినిపిస్తోంది.


గాజుగ్లాసు నేలకేసి కొట్టినట్లు భళ్ళున వచ్చిన శబ్దాన్ని బట్టి గ్రహించింది లక్ష్మీదేవి.

''ఈ కోపం, ఈ ఆవేశం, ఈ దురలవాట్లు వల్ల మీరు జీవితంలో చాలా నష్టపోతున్నారు. ఇటు మీకు సుఖం లేదు. అటు మాకు సుఖం లేదు. ఇంటి పరువుప్రతిష్టలు వీధిన పడుతున్నాయి. దయచేసి మీరు మారండి''

''వెధవ లం...! ఊరుకున్న కొద్దీ పేట్రేగి పోతున్నావు. ఆడదానివి నోరు మూసుకుని ఇంట్లో పడి వుండక వాగుతున్నావ్'' కొడుకు చేసిన సింహగర్జన, ఆ వెంటనే పెడీ పెడీమని కోడల్ని కొడుతున్న దెబ్బల శబ్దం వినిపించాయి.

కోపంతో, ఒళ్ళు తెలియని ఆవేశంతో విసురుగా వెళ్ళి బెడ్‌రూమ్ తలుపులు దబదబా బాదింది లక్ష్మీదేవి. తలుపులు తెరుచుకోగానే లోపలికి దూసుకుంటూ వెళ్ళి కింద పడి ఏడుస్తున్న కోడలి రెక్కపట్టుకుని గబగబా బైటికి తీసుకొచ్చింది.

''వాడు మూర్ఖుడు. వాడిక మారడు. వాడ్ని మార్చే ప్రయత్నాలు ఇకనుండి మానుకో. ఏడవకు. ఇలాంటివాడు నా కడుపున పుట్టినందుకు నేను ఏడవాలి. ఈ అవమానం నీకే కాదు నాకు కూడా. వద్దు..వద్దు అనుకుంటూనే నిన్ను ఈ దుర్మార్గుడికి భార్యను చేసినందుకు ఆ దేవుడు నన్ను క్షమించడు'' అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్న అత్తగార్ని ఉద్దేశించి ''మీరు బాధపడకండి. మీ స్థానంలో వున్న ఏ తల్లయినా అప్పుడు మీలాగానే ఆలోచిస్తుంది'' అంది సరస్వతి.



లక్ష్మీదేవి ఆ రాత్రంతా తీవ్రంగా ఆలోచించింది.

ఇలాంటి సంఘటన ఈ ఇంట్లో మరోసారి జరిగితే చూసి తట్టుకునే శక్తి తనకు లేదు. నిండు చూలాలని కూడా చూడకుండా చెయ్యి చేసుకున్న వాడు, రేపు ఇంకెంతకయినా తెగిస్తాడు. పుట్టబోయే పిల్ల మీద ఈ ఇంటి వాతావరణ ప్రభావం ఏ దుష్పరిణామాలను చూపకముందే ఇక్కడి నుంచి సరస్వతిని తీసుకుని తను ఎటయినా వెళ్ళిపోవాలి అన్న ఆలోచన రాగానే, ఆ సంకల్పం అంతకంతకూ గట్టిపడి దృఢనిర్ణయంగా మారింది ఆమెలో.

ఆ మర్నాడు- ''సరస్వతీ'' కోడల్ని పిలిచింది లక్ష్మీదేవి.

''ఏంటత్తయ్యా?''

''ఈరోజునుంచీ నా కొడుకుతో తెగతెంపులు చేసుకుని నేను ఇల్లు వదిలి వెళ్ళిపోతున్నాను. నువ్వు కూడా నాతో వస్తున్నావు''

''అత్తయ్యా!''

''వాడు ఈ ఇంటికే కాదు. ఈ సమాజానికే పట్టిన చీడపురుగు. ఇప్పుడు నువ్వు నీ గురించే కాదు, నీ కడుపులోని బిడ్డను గురించి కూడా ఆలోచించాలి. అది నీ బాధ్యత'' అంది లక్ష్మీదేవి సూటిగా కోడలి కళ్ళల్లోకి చూస్తూ.

ఒక్క నిముషం ఆలోచించి ''మీ నిర్ణయమే నా నిర్ణయం. పదండి వెళ్దాం'' అంది సరస్వతి.

## బిజీ భూమిక

**'అమ్మాయే సన్నగా....అరనవ్వే నవ్వగా'అంటూ కుర్రకారు చేత పాడించుకున్న భూమిక ఇప్పుడో బిజీతారగా మారిపోయింది. ఇంతకుముంతర ఆమె నటించిన ఖుషి, రోజాపూలు ప్రేక్షకుల ప్రశంసలందుకున్నాయి. ఎన్నో అంచనాలతో నటించిన వాసు చిత్రం కొంచెం నిరాశ పరిచినా చాలా గ్యాప్ తరువాత ఎంతో ధీమాతో మళ్లీ ఒక్కడులో నటించింది. ఆ చిత్రం సూపర్‌హిట్ కావడంతో ఆమెకి ఆఫర్ల మీద ఆఫర్లు వస్తున్నాయి. ఆ సినిమా హిట్ అయినా ఆమె అభినయం మాత్రం అభిమానుల్ని అంతగా సంతృప్తి పరచలేదు. ఆమె తన కెరీర్ రూపకల్పనలో ముస్ముందు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలనుకుంటోంది.**

★ ★ ★

సరస్వతి ఆఫీసుకెళ్తూ ఆలోచిస్తోంది.

తారు రోడ్డుమీద కారు వేగంగా దూసుకుపోతోంది.

తనిలా ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌లో వుండగలనని, డ్రైవింగ్ చేస్తూ కారులో ఆఫీసుకు వెళ్ళగలనని ఏనాడయినా అనుకుందా? ఇదంతా అత్తగారి చలువ. ఆ కాలం మనిషయివుండీ ధైర్యం, తెగింపుతో ఆనాడు అంత పెద్ద నిర్ణయాన్ని తీసుకుంది ఆమె. తను ఆమెలా ఎందుకు ఆలోచించలేకపోయింది ఆరోజు. ఆ ఇల్లు వదిలి ఆమెతో అలా బయటికి వచ్చేయకుంటే ఇప్పటికీ తన బతుకు అలాగే అవమానాలతో, అడ్జస్ట్‌మెంట్లతో నాలుగుగోడల మధ్య ఊపిరాడని ఇరుకుబ్రతుకు అయిపోయి వుండేది. ఇంత మంచి జీవితాన్ని ఇచ్చినందుకు ఏం చేసి తను అత్తగారి ఋణం తీర్చుకోగలదు? అని ఆలోచిస్తోంది సరస్వతి.


పి.జి. ఫస్టియర్ పరీక్షల సమయంలో గాయత్రి రెండు నెలల పసిగుడ్డు. ఫీడింగ్ మదర్‌గా వుండి పరీక్ష రాయడం అసాధ్యం అని ఆలోచిస్తుంటే 'అసాధ్యం అన్న మాటను నీ మెదడులోకి రానివ్వకు. ఇప్పుడు నువ్వు పరీక్ష రాయకపోతే ఒక సంవత్సరం వృధా అయిపోతుంది. మూడొందల అరవై ఐదు రోజులంటే జీవితంలో పెద్దకాలం. నువ్వేమీ దిగులుపడకు. నీతోపాటు నేనూ గాయత్రిని తీసుకుని పరీక్ష సెంటర్‌కు వస్తాను. వెళ్ళే ముందు ఇంట్లో పాలిచ్చి వెళ్ళి, మధ్యలో ఒకసారి పర్మిషన్ అడిగి బయటకు రా పాలివ్వడానికి. ఆ తరువాత పరీక్ష అయ్యేవరకు పిల్లను పెట్టుకుని నేను అక్కడే బయట కూర్చుంటాను' అంది అత్తగారు. ఆ మాటలకు తను అప్పుడు ఆశ్చర్యపోయింది. ఆవిడ పట్టుదల, ఆ ఆలోచనా విధానం తనకు లేకపోయినందుకు సిగ్గుపడింది. ఆ రోజు నుంచి తల్లి, తండ్రి, దైవం, అత్తగారు మాత్రమే కాదు ఆమె తనకు 'గురువు'గా కూడా మారిపోయింది. ఇప్పుడు హోదాపరంగానే కాదు మానసికంగా కూడా తను చాలా ఎదిగింది. తన ఎదుగుదల రేపు తన బిడ్డ ఎదుగుదలకు దోహదం కాబోతోంది- అనుకుంది సరస్వతి.

ఆడదానికి తోడు లేకపోతే బ్రతుకెంత దుర్భరమో ఇప్పుడు ఆయనకి తెలిసివస్తున్నది. ఎదుటపడటానికి ముఖం చెల్లక ఉత్తరాలు రాస్తున్నాడు. అదే విషయం అత్తయ్యతో అంటే ఆమె తేలిగ్గా నా అభిప్రాయాన్ని కొట్టిపడేసింది?!

''పొరపాటు పడుతున్నావ్ సరస్వతీ- వాడు మారలేదు మారడు. వాడికి వండిపెట్టడానికి ఇంట్లో అమ్మలేదు. అందుకని ఇబ్బందిగా వుంది. బట్టలు ఉతికి, బూట్లు తుడిచి, అవసరం వచ్చినప్పుడు రెడీమెడ్‌గా ఇంట్లో వుండి కోరికతీర్చి, కోపం వచ్చినప్పుడు ఆ కోపాన్ని వెళ్ళగక్కడం కోసం తిట్లు, తన్నులు తిని ఇంట్లోపడి వుండే పెళ్ళాం లేదు. అందుకని ఇబ్బందిగా వుంది. మన ఆడవాళ్ళలో వున్న బలహీనతలేమిటో వాడికి తెలుసు. క్షమాగుణం, సహనశక్తి, ప్రేమించే మనసు వీటిమీద దెబ్బతీస్తే మళ్ళీ మనం వాడి అధికారం కిందికి అవలీలగా వస్తామని వాడి ప్రగాఢ విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నమ్మిచేయకపోతే మనం బయటికి వచ్చి ఇన్నాళ్ళు కష్టపడి ఇంత .సాధించిందీ వృధా అయిపోతుంది. నువ్వూ ఆలోచించు'' అంది లక్ష్మీదేవి. ఎంత చక్కగా ఎంత లోతుగా ఆలోచించి చెప్పింది ఆవిడ ఆ విషయం? ఒక పల్లెటూరిలో పుట్టి, పెరిగి అంతంతమాత్రం చదువు చదివిన ఆమెకు ఇంత సాహసం, ఇంత జీవిత విశ్లేషణ ఎలా అలవడ్డాయి? పరిస్థితులే మనిషిని రాటుతేలుస్తాయేమో. కొడుకు అలాంటివాడు కాబట్టే ఆమె ఇలాంటి నిర్ణయాలు తీసుకోవలసి వస్తున్నది. తన గౌరవానికి, వ్యక్తిత్వానికి భంగం కలగనంతవరకూ స్త్రీ అంత సాధుస్వభావి మరొకరు వుండరు. తన భర్తకోసం తన కుటుంబం కోసం ఆమె ఎన్ని త్యాగాలైనా చేస్తుంది. తనను తాను ఎంతగానయినా అర్పించుకుంటుంది. అలాగాక తన ఆత్మాభిమానానికి తన ఉనికికి విఘాతం ఏర్పడినప్పుడు ఎంతకైనా తెగిస్తుంది. ఏమైనా చెయ్యగలుగుతుంది' అనుకుంది సరస్వతి.

★ ★ ★

లివింగ్‌రూమ్‌లో కుర్చీలో కూర్చుని ఆఫీసు ఫైల్స్ చూసుకుంటోంది సరస్వతి. ఆఫీసు పని కాక ఇంట్లో హోంవర్క్ కూడా చేసి అలిసిపోతున్న కోడలంటే జాలి లక్ష్మీదేవికి. ఎప్పుడో విసిరి వుంచుకున్న మినప్పిండి వుంటే దాన్ని తీసి సున్నుండలు కడుతూ కూర్చుంది. ఇంతలో గాయత్రి కూడా స్కూలునించి వచ్చేసింది.




ఆరోజెందుకో రోజులా చలాకీగా లేదు. వస్తూనే ధుమధుమలాడుతూ- ''అమ్మా..మా నాన్న ఏడి? ఆయన ఎక్కడ వుంటారు? మా స్కూల్లో అందరూ మీ నాన్న ఏడి? అని అడుగుతున్నారు'' అడిగింది ఉద్వేగంగా.

సరస్వతికి ఒక్కసారిగా షాక్ తగిలినట్లయింది. అవతల లక్ష్మీదేవి పరిస్థితీ అలాగే వుంది. ఏదో ఒక రోజు ఇలాంటి ప్రశ్నను ఎదుర్కోవలసి వస్తుందని అనుకుంటూనే వున్నారు వాళ్ళు.

''గాయత్రీ! ఇలారా నీ ప్రశ్నకు నేను సమాధానం చెబుతాను'' అని మనవరాల్ని పిలిచింది లక్ష్మీదేవి. గిరుక్కున తిరిగి బామ్మ దగ్గరికి వెళ్ళింది గాయత్రి. ''చూడమ్మా. మీ నాన్న ఏడీ? అని నిన్ను ఎవరన్నా అడిగినప్పుడు నీకు ధైర్యం వుంటే 'మా అమ్మ మా నాన్నను వదిలేసింది' అని చెప్పు. అలా చెప్పే ధైర్యం లేకుంటే 'మా నాన్న చచ్చిపోయాడని చెప్పు'' అంది లక్ష్మీదేవి సున్నుండలు కట్టే పనిని కొనసాగిస్తూనే.

సరస్వతి ఉలిక్కిపడింది ఆ మాటలకు.

అయోమయంగా చూస్తూ ''అదేంటి?'' అని అబ్బురపడింది గాయత్రి.

''అదంతేనమ్మా. నువ్వింకా చిన్నపిల్లవుకదా. అప్పుడే నీకు ఇవన్నీ అర్థం కావు. ఒక్క విషయం మాత్రం తెలుసుకోవటానికి ప్రయత్నించు. మీ అమ్మకు తనకంటూ ఒక జీవితం వుంది. ఒక భవిష్యత్తు ఉంది. ఒక వ్యక్తిత్వం వుంది. మీ నాన్న ఓ క్రూరమృగంలా ప్రవర్తిస్తూ ఆమె బ్రతుకే ఒక గుదిబండగా మారిన పరిస్థితులలో తన అస్తిత్వాన్ని వెతుక్కుంటూ మీ అమ్మ బయటికి వచ్చేసింది. కనుక అమ్మను నాన్నతో ముడివేసి కాక ప్రత్యేకంగా అమ్మను అమ్మలా చూడు'' అంది లక్ష్మీదేవి. గాయత్రి ముఖంలో కొంత అర్థమయీ, కొంత అర్థంకాని ద్వంద్వభావాలు దోబూచులాడాయి ఆ క్షణంలో.

రెండు సున్నుండలు ప్లేట్‌లో పెట్టుకొని వచ్చిన లక్ష్మీదేవి కోడలి కళ్ళల్లోని ఆనందభాష్పాలని గమనించి ''సరస్వతీ!

జీవితం పుస్తకంలాంటిదయితే, అందులో నీ భర్తతో నువ్వు గడిపిన ఆ మూణ్ణాళ్ళ జీవితం ముగిసిన అధ్యాయం లాంటిది. పేజీ తిరగేసి కొత్త అధ్యాయంలోకి ప్రవేశించి ముందుకు సాగిపోవాలి గానీ అక్కడే ఆగిపోయి మురుగుజ్జు బ్రతుకు బ్రతకకూడదమ్మా'' అంది లక్ష్మీదేవి కోడలికి నీకు నేనున్నానన్న నమ్మకం కలిగిస్తూ.

✪